క్లుప్తంగా

నీటి సరఫరాలో క్లోరినేషన్ తప్పనిసరి


సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

సి.బెళగల్: ప్రజలకు క్లోరినేషన్ చేసిన తాగునీటినే సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాలైన కొత్తకోట, ఈర్లదిన్నె, ముడుమాల, పోలకల్ గ్రామాల్లో పర్యటించారు. నీటి సరఫరా విధానాన్ని పరిశీలించారు. నదినీరు నేరుగా ప్రజలకు సరఫరా చేయకుండా క్లోరినేషన్ చేయాలని సూచించారు. క్లోరినేషన్ విధానాన్ని తెలియజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు.

పత్తిలో సస్యరక్షణపై అవగాహన


ఈర్లదిన్నెలో పత్తి రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

సి.బెళగల్: మండల రైతులు పత్తిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తకోట, ఈర్లదిన్నె, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో సాగవుతున్న పత్తి పంటను ఆయన పరిశీలించారు. పత్తిలో పచ్చ, తెల్ల దోమలను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. పచ్చ పురుగు నివారణకు లీటరు నీటిలో ఒక మిల్లీ లీటర్ క్లోరిపైరిఫాస్, అసిఫేట్ అదేవిధంగా ఐదు మిల్లీలీటర్ల వేప నూను కషాయాన్ని పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు ఉన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర


ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓలు

గడివేముల: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని.. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంఈఓలు మేరీ సునీత, విమల వసుందర దేవి అన్నారు. బుధవారం గడివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి దోహదపడాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్టులు ఫిజియోథెరపీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆరోగ్య జీవనానికి అవసరమైన వ్యాయామాలను తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న మాదిగ విద్యార్థి సమాఖ్య నాయకులు

పాణ్యం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 7న వరంగల్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సామేలు, పాణ్యం మండల అధ్యక్షుడు బాబు అన్నారు. బుధవారం పాణ్యంలో వారు మాట్లాడుతూ.. 1994లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి ఇప్పటికి 30 ఏళ్లు అవుతోందని తెలిపారు. అంబేడ్కర్ ఆశయాల కోసం పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ నాయకత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు


గూడూరులో దోమల మందు పిచికారీ చేస్తున్న కార్మికులు

గూడూరు రూరల్: పట్టణంలోని కాలనీల్లో దోమల నివారణకు బుధవారం మందులు స్ప్రే చేయించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర పంచాయతీ చైర్మన్ జె.వెంకటేశ్వర్లు, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని మాల వీధి, సంజీవయ్యనగర్, తెలుగు వీధి, ఎరుకల కాలనీ, దెయ్యం కట్ట, రాజవీధి తదితర కాలనీల్లో డ్రైనేజీలు, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా తమ తమ వంతుగా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విత్తనశుద్ధి.. సాగు వృద్ధి

పంట ఏదైనా విత్తనాన్ని శుద్ధి చేసి విత్తుకోవడం వల్ల నాటిన తర్వాత 25 నుంచి 30 రోజుల వరకు చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటకు రక్షణ కల్పిస్తుంది. ఇప్పుడు చాలా కంపెనీలు విత్తనశుద్ధి చేసిన తర్వాతనే రైతులకు విక్రయిస్తున్నాయి. అయినా సరే రైతులు మరోసారి విత్తనశుద్ధి చేసుకోవడం ఉత్తమం. జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షాలు కురవడంతో కొందరు రైతులు ఇప్పటికే పంటలను సాగు చేశారు. మరికొందరు సాగుకు విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఖరీఫ్ సాగుకు రైతులు చురుగ్గా పనులు చేసుకుంటున్న వేళ విత్తనశుద్ధి ప్రాధాన్యతపై వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ ఏడీఏ సాలురెడ్డి సూచనలు..

- తెగుళ్ల నివారణలో ముఖ్య భూమిక
- పంటకు రక్ష
- ఆశాజనకంగా దిగుబడులు
- కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచనలు


విత్తనాలను శుద్ధిచేస్తున్న మహిళా రైతులు (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్): గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొందరు సాగుకు దూరంగా ఉన్నారు. ఈ ఏడాది తొలకరి వర్షాలతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ నెల ఆశించిన వర్షపాతం నమోదు కావడంతో జోరుగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. అయితే సాగులో కొన్ని జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టపోయే అవకాశం ఉంది. ముఖ్యంగా విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల తెగుళ్ల నివారణతో పాటు మొక్కకు రక్షణ కవచంగా ఉంటుంది. వివిధ పంటల్లో పాటించాల్సిన విత్తనశుద్ధి పద్ధతులు, వాటికి ఉపయోగించాల్సిన రసాయనాల గురించి చూద్దాం


ఏడీఏ సాలురెడ్డి

వేరుశనగ : ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యుకొనజోల్ 2డీ లేదా 3 గ్రాముల మాంకోజెబ్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందును పట్టించాలి. కాండము కుళ్లు, వైరస్ తెగులు (పీఎస్ఎన్‌డీ), వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 1 మి.లీ ఇమిడాక్లోప్రిడ్, 600 ఎఫ్ఎస్(గాచో) 6 మి.లీ నీళ్ల మిశ్రమంతో విత్తనశుద్ధి చేయాలి. వరిమాగానుల్లో కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు విత్తనానికి రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. మొదలు కుళ్లు, వేరుకుళ్లు, కాండం కుళ్లు తెగులు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పట్టించాలి. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందుతో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టిన తరువాత శిలీంద్రనాశినితో శుద్ధి చేయాలి. అవసరమైతే రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టించవచ్చు.

పత్తి : పత్తిలో రసంపీల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో బీటీ విత్తనం రసం పీల్చే పురుగు నివారణకు విత్తనశుద్ధి చేసిందే లభిస్తోంది. నాన్ బీటీ సాగు చేసే రైతులు కిలో విత్తనానికి తగినంత జిగురు కలిపి 5గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ లేదా 4 గ్రాముల థయోమిథాగ్జమ్‌తో విత్తన శుద్ధి చేసి విత్తితే పంటను 40-45 రోజుల వరకు రసంపీల్చే పురుగుల నుంచి రక్షించుకోవచ్చు. అదే విధంగా తెగుళ్ల నివారణకు కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బెండజిమ్ లేదా 2 గ్రాముల కార్బోక్సిన్ లేదా 3 గ్రాముల ట్రైకో డెర్మా విరిడి లేదా సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేయాలి.

మొక్కజొన్న : మొక్కజొన్న కిలో వత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మువ్వ ఈగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.

జొన్న : కిలో విత్తనానికి 3 గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. మువ్వ రాగ నివారణకు కిలో విత్తనానికి 3 గ్రాముల థయోమిథాగ్జమ్ మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి.


ఖరీఫ్ కోసం సిద్ధం చేసిన వేరుశనగ విత్తనాలు

పొద్దుతిరుగుడు :పొద్దుతిరుగుడులో ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు క్వింటాల్(ఇప్రోడియోన్ 25శాతం+కార్బెండజిమ్ 25 శాతం) లేదా సాఫ్ (కార్బెండజిమ్ 12 శాతం + మాంకోజెబ్ 63 శాతం) అనే మందును 2 గ్రాములు కిలో విత్తనానికి విత్తనశుద్ధి చేయాలి. నెక్రోసిస్ వైరస్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో కిలో విత్తనానికి థయోమిథాగ్జమ్ (క్రూయిజర్) 4 గ్రాములు లేదా 5 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి.

మిరప : కిలో మిరప విత్తనానికి మొదట వైరస్ తెగుళ్ల నివారణకు 150 గ్రాముల ట్రైసోడియం ఆర్థో ఫాస్ఫేట్‌ను లీటరు నీటిలో కరిగించి ఆ మందు ద్రావణంలో 15-30 నిమిషాల పాటు విత్తనాన్ని నానబెట్టాలి. ఈ తర్వాత రసం పీల్చే పురుగుల నివారణకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్, చివరగా ఇతర తెగుళ్ల నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ద్రవరూప జీవన ఎరువులు వాడే పద్ధతి

అజటోబ్యాక్టర్ 200 మి.లీను 5-10 లీటర్ల నీటిలో కలిపి నారు నాటే ముందు అరగంట వరకు నారును ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

మాదకద్రవ్యాలతో జీవితం అంధకారం


కోడుమూరు: ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు

కోడుమూరు రూరల్: మాదకద్రవ్యాలకు బానిసైతే జీవితం అంధకారం అవుతుందని.. వాటికి దూరంగా ఉండాలని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. బుధవారం కోడుమూరు పోలీసులు, సెబ్ పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో పాటు, విలువైన జీవితాన్ని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను తెలుపుకుని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ ఎస్ఐలు బాలనరసింహులు, హనుమంతప్ప, తిమ్మారెడ్డి, సెబ్ ఎస్ఐ ఆలీబేగ్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో భవిష్యత్తు అంధకారం

పాణ్యం: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని.. వాటికి దూరంగా ఉండాలని సెబ్ జిల్లా సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, సీఐ విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రావ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని పేర్కొన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సెబ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి


ధరలను నిత్యం పర్యవేక్షించాలి

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి, టమాట, ఇతర కూరగాయల ధరలను ప్రతి రోజు పర్యవేక్షించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం సాయంత్రం నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. రైతుబజారులో, బయట టమాట, ఉల్లి, కూరగాయల ధరలను పరిశీలించారు. ధరల పెరుగుదలపై వినియోగదారులతో కూడా ముఖాముఖి మాట్లాడారు. బోర్డులో నమోదు చేసిన ధరల ప్రకారమే కూరగాయలు విక్రయిస్తున్నారా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ శాఖ అధికారులు, రైతుబజారు సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవిలో కూరగాయలు, టమాట సాగును ప్రోత్సహిస్తే మే, జూన్ నెలల్లో కూరగాయల కొరత ఏర్పడదని పేర్కొన్నారు. బోర్డులో నమోదు చేసిన ధరలను ప్రతి ఒక్కరూ పాటించే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు నారాయణమూర్తి, రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టీకల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సీ.క్యాంపు రైతుబజారులో తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కర్నూలు (సిటీ): కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ సూచించారు. బుధవారం కోసిగి, కోడుమూరు కేజీబీవీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. కోసిగి కేజీబీవీలో భోజనం సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే సంబంధిత కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్/ ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కేజీబీవీల్లో నిర్దేశిత మెనూను పక్కాగా అమలు చేయాలని, వంట తయారీకి నాణ్యమైన వస్తువులను వినియోగించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే నిర్దేశిత సమయంలోపు సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఇచ్చిన వర్క్‌బుక్‌లను, నోటు బుక్కులను రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తూ ఉండాలని సూచించారు.



రాక్‌గార్డెన్‌లో పోలీసుల బందోబస్తు

రాక్‌గార్డెన్స్‌లో సినీ సందడి

ఓర్వకల్లు: మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని రాక్‌గార్డెన్స్‌లో బుధవారం సినీ సందడి నెలకొంది. ప్రముఖ తెలుగు హీరో నందమూరి బాలకృష్ణ 109వ చిత్రానికి సంబంధించిన ఓ పాట, విలన్ సన్నివేశాలను చిత్రీకరించేందుకు చిత్రబృందం రాక్‌గార్డెన్‌కు వచ్చింది. మూడు రోజుల పాటు జరిగే చిత్రీకరణను తిలకించేందుకు అభిమానులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలు ఉండడంతో రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సితారా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో వస్తున్న ఈ సినిమాకు సూర్యదేవర నాగవంశీ నిర్మాత. బాబి దర్శకత్వం వహిస్తున్నారు.

స్పోర్ట్స్

విద్యార్థులకు ఆటలూ అవసరం

కర్నూలు (టౌన్) : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని విజ్ఞానపీఠం పాఠశాల కార్యదర్శి గురుమూర్తి అన్నారు. ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటు అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు జరిగాయి. త్రోబాల్ పోటీల్లో విజ్ఞానపీఠం పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. బుధవారం వారిని ఆయన పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ చాటి కప్ సాధించారన్నారు.

స్కేటింగ్‌లో రాణింపు గర్వకారణం

కర్నూలు(టౌన్): స్కేటింగ్ రాష్ట్రస్థాయి జోనల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించడం గర్వకారణమని మాజీ మంత్రి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ కేఈ ప్రభాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను మాజీ మంత్రి అభినందించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, అంకితభావంతో ప్రతిరోజూ సాధన చేయాలన్నారు. పతకాలు సాధించిన సాహితీ, శ్రీతిక్ చౌదరిలను అభినందించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీష్ కుమార్, మాజీ అధ్యక్షుడు విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, స్కేటింగ్ ఉపాధ్యక్షుడు సునిత్‌కుమార్ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

కర్నూలు (టౌన్): జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక బాష్యం పాఠశాలలో కరాటే క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడను సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో బాష్యం పాఠశాలల జోనల్ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మాధవి పాల్గొన్నారు.

విజేతగా తిరిగి రండి

కర్నూలు (టౌన్) : ధర్మవరంలో ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న 14 వ సీనియర్ మెన్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ చాటి విజేతగా తిరిగి రావాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభ చాటితే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావచ్చన్నారు. ఇలాంటి అవకాశాలను హాకీ క్రీడాకారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్ మహేష్, హాకీ సంఘం నాయకులు దాసరి సుధీర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు జానపద నృత్యప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: దక్షిణ ఆంధ్ర సంభాగ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు ఏకల్ అభియాన్ ఏకల్ గ్రామ సంఘటన్ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక దేశభక్తి సహిత కళా ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సునీల్‌కుమార్, రమణమూర్తి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులతో దేశభక్తినిన పెంపొందింప చేసే సాంస్కృతిక ప్రదర్శనలు, జానపద నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కోడుమూరు రూరల్: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోడుమూరు తాలుకా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సూపరింటెండెంట్ క్రిష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, సెక్రటరీ కృష్ణమోహన్, జాయింట్ సెక్రటరీ మంజుల, ట్రెజరర్ మహమ్మద్ బాషా, జిల్లా కౌన్సిలర్లు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఈసీ మెంబర్లుగా ఐజయ్య, అరవింద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పీఆర్ ఏఈ గంగరాజు వ్యవహరించారు. ఎన్నికైన సభ్యులను కోడుమూరు తాలుకా సిబ్బంది పూలమాలలతో సత్కరించారు.


ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు


స్వర్ణ కాంతులు

ఆస్వాదించే మనస్సు ఉండాలేగానీ ఏ చిత్రకారుడు చిత్రీకరించని ఎన్నో అందాలను ప్రకృతి మనకు నిరంతరం చూపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఉదయించే సూర్యుడు ఆకాశాన వెలుగు పంచుతూ కనిపిస్తాడు. అలాగే సూర్యాస్తమయంలో తన కిరాణాలతో ఎన్నో రంగులు, అందాలతో మైమరపిస్తాడు. బుధవారం గడివేముల మండల పరిధిలోని కరిమద్దెల గ్రామ సమీపంలో సంధ్యాసమయాన ఆకాశంలో సూర్య కిరణాలు స్వర్ణ కాంతులను తలపించాయి ఈ సుందర దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. –గడివేముల

మా స్థలాలను వివాదంలోకి లాగొద్దు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు గ్రామసర్వే నంబర్ 524లో 10.64 ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డుకు చెందినది కాదని, అయితే కొందరు అధికారి, అనాధికార వ్యక్తులు అనవసరంగా లేనిపోని సమస్యలు సృష్టించి వివాదంలోకి లాగుతున్నారని 524 కాలనీపరిరక్షణ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కాలనీలో ఆ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లా మైనార్టీ అధికారి కాలనీలో పర్యటించి తాము నివాసం ఉంటున్న కొన్ని ఇళ్ల స్థలాలు వక్ఫ్‌బోర్డు పరిధిలోకి వస్తాయని చెప్పడం భావ్యం కాదన్నారు. 40 ఏళ్ల క్రితం వేసిన వెంచర్‌లో 300 ప్లాట్లను కొనుగోలు చేశామని, అందులో కొందరు ఇళ్లు కూడా కట్టుకున్నారన్నారు. అయితే కొందరు అనధికార వ్యక్తులు తాము కొనుగోలు చేసిన ప్రాంతం వక్ఫ్ బోర్డు పరిధి కిందకు వస్తుందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఏపీ హైకోర్టుకు కూడా వెళ్లినట్లు చెప్పారు. తమ కాలనీకి సమీపంలో వక్ఫ్‌బోర్డు భూమిలో మునిసిపల్ అధికారులకు తెలియకుండా పెద్ద భవనాన్ని నిర్మిస్తున్నారని, అధికారులు దానిని అడ్డుకోవాలని కమిటీ అధ్యక్షుడు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు,హరిప్రసాదు, రాముడు, బాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాలనీవాసులు

సంక్షేమ హాస్టళ్లపై దృష్టి సారించండి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని సాంఘిక సంక్షేమ వసతి గృహ అధికారుల ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి. సుంకన్న కోరారు. బుధవారం సెక్రెటేరియట్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి వినతి పత్రం అందించారు. వసతి గృహాల్లో సరైన వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు, వార్డెన్లు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు.

బైక్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న శ్రీహరిణి

కోడుమూరు రూరల్: రోడ్డు దాటుతున్న బాలికను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం కోడుమూరులో చోటు చేసుకుంది. మండలంలోని గోరంట్లకు చెందిన జయపాల్, లక్ష్మీదేవి దంపతులు కుమార్తె శ్రీహరిణితో కలిసి బ్యాంకు పని నిమిత్తం కోడుమూరులోని ఎస్‌బీఐకు వచ్చారు. బ్యాంకు వద్ద రోడ్డు దాటుతున్న బాలికను కోడుమూరు వైపు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. బాలిక తలకు తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు కోడుమూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన రాముడు

రోడ్డుపై నిల్చున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి కోడుమూరులో చోటు చేసుకుంది. వివరాలు.. కోడుమూరుకు చెందిన రాముడు మంగళవారం రాత్రి పట్టణంలోని కర్నూలు మార్గంలోని రామాలయం వద్ద రోడ్డుపై మరో వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ లారీ అతన్ని ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి రాముడు 10 అడుగుల దూరం ఎగిరిపడ్డాడు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల వారు రాముడును సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.